# ఎదల్లోని పొరలు

కొత్తగా మొలిచిన భుజకీర్తుల్లా, శ్రీహరిని ఎడబాయని శంఖచక్రాల్లా నా పదోన్నతితో నాకు వో అటెండరూ, వో పి.యే అంటూ యిద్దరు వ్యక్తులు సదా నా వెంట వుండటం మొదలైంది.

ప్రకృతి సిద్ధంగానే నాకు కొన్ని పనులు చేతకావు. మరికొన్ని చిన్నచిన్నపనులు అసలే తెలియవు. అలాంటి నేను ఈ ఇద్దరి రాకవల్ల మరీ సుఖభోక్తలా మారిపోయాను. ప్రతి విషయానికి ప్రొటోకోలంటూ ఒకటి అడ్డురావడంతో నేను మరీ కాబోయే యువరాజు, రాచమార్యదలను జీర్ణించుకునే తర్ఫీదు పొందుతున్న స్థితిలో పడిపోయాను.

సరే! వో వైపు ఆనందం, మరోవైపు ఇబ్బంది, రెండూ వున్నాయి లెండి. నాణెం అన్నాక బొమ్మా బొరుసు వుండి తీరాల్సిందే కదా!

ఆ రోజు అర్జంటుగా టూరు వెళ్లాలి. ఇంకా అలవాటు కాని మూలాన ప్లేను వద్దు, రైల్లోనే ప్రయాణం చేస్తానన్నాను. ఏర్పాటైంది. ఈ పదవితో మా యింట్లో ఇన్నాళ్లలాగా మా వాళ్లకు, నాకు తోడుగా స్టేషను వరకు వచ్చి బోగీ అదీ చూచి నన్నా సీట్లో కూర్చోబెట్టే బాధ్యత నుండి విముక్తి లభించినందుకు సంతోషంగా వున్నారు. ఇప్పుడా బాధ్యతంతా పాపం మా పి.యే, అటెండర్ల వశమైంది. నేను వారి మాట వింటూ వారినీ వో మనుష్యుల్లా గౌరవిస్తున్నాను. చాలా మంచిదాన్ని అంటూ వారు సంతోషంగానే వున్నారు.

స్టేషను బాగా రద్దీగా వుంది. వచ్చిపోయే జనసందోహంతో మార్గమంతా క్రిక్కిరిసిగా వుంది. కొంచెం ముందు వెనకగా (మరీ సమానంగా నడవకూడదు కాబట్టి) మా పి.యే గారు చకచక నడకలతో నడుస్తూ నా వునికికే వో ప్రత్యేకతను కల్పిస్తున్నారు. అంతేకాదు తప్పుకొండి, తప్పుకొండి అంటూ జనాన్ని హెచ్చరిస్తూ వెంటనే దారివ్వని ముసలీ, ముదుకను అవతలికి తోస్తున్నాడు. ఇదంతా నా కోసమే? గర్వంగా ఫీలయ్యాను.

ఇంతలో మాంచి పొడుగాటి పొడుగలతో కండరాలు బలసిన నలుగురు మొనగాండ్లు నా దారికి అడ్డంగా నడుస్తూ కనిపించారు. చూచీ చూడనట్లు బరాబరులు మాని, కిక్కురు మనకుండా నేల చూపులు చూస్తూ 'అమ్మగారు! కాస్త జాగ్రత్త, నెమ్మదిగా నడువండి' అంటూ హెచ్చరిస్తూ నన్ను వో అపురూపమైన గాజు వస్తువులా కాపాడుకుంటూ నడిపిస్తున్నారు, పి.ఏ. గారు.

ఆశ్చర్యం వేసింది. లోకజ్ఞానంలో నేను సున్నాగా మిగిలాను. తెలిసికోవలసిందీ, చేయవలసింది, సాధించవలసిందీ ఎంతో ఉందనుకున్నాను.

వెంటనే ఆలోచనల్ని కట్టిపెట్టి ముందు చూపుతో నడుస్తూ ప్లాట్‌ఫారం మెట్లెక్కి దిగి 'నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్' ఫస్ట్‌క్లాస్ పెట్టెలో ఎక్కి కూర్చున్నాను. పాపం తన సీటు వెతుక్కునేందుకు మా పి.ఎ. గారు వెళ్లిపోయారు. విధి నిర్వహణలో ఉన్న మజా అది. ఏదో ఘనవిజయం సాధించినట్లు సర్దుకు్కూర్చున్నాను.

కొత్తగాలి పీల్చినట్లు హాయిగా ప్రశాంతంగా వుంది. ఇంతలోకే మా అటెండరు మహబూబు వచ్చి 'అమ్మా! డబ్బా అంత ఖాళీగానే వుంది' అన్నాడు. నిజమే! ఏదో వెలితిగా తోచింది. ఓ అయిదు నిముషాల తర్వాత క్యాబిన్ ఇవతలికి వచ్చి చూచాను. నాది ఆరో నెంబరు. నా తరువాత 7, 8 (జి. హెచ్) అంటూ రెండుంటాయి. అంటే ఈ 'ఎఫ్' బోగీలో దాదాపు 50 ప్రయాణికులైనా వుండి వుండాలి. అయినా ఏ ఒక్కరూ మెసిలిన జాడకానీ చీమ చిటుక్కుమన్న సవ్వడి కానీ వినిపించలేదు.

అప్పుడెందుకో నాకు భయం వేసినట్లైంది. మానవ దర్శనానికి ముఖం వాచినట్లు రవ్వంత మనుషుల అలికిడి కోసం చెవులు నిక్కబొడుచుకున్నట్లు అనిపించింది. పోనీలే బెడ్‌రోల్స్ ఇచ్చే వాడైనా వస్తాడుగా అనుకున్నాను. వాడు రాలేదు. నేను పెట్టె తెరచి దుప్పటి తీసి పరచుకుని శాలువా కప్పుకుని పడకున్నాను. చేసేది లేక. అయినా రావలసిన బంధువుల కోసం ఎదురుచూస్తున్నట్లు కిటికీ లోంచి ఆత్రంగా చూస్తూనే వున్నాను.

సికింద్రాబాదు రానే వచ్చింది. జనం కిటకిటలాడుతున్నారు. అందరూ సామాన్యంగా పెట్టెలు సంచులు మోస్తూ ఎక్కేందుకు హడావుడి పడ్తూనే వున్నారు.

నిరుత్సాహపడింది మనస్సు. వీళ్లంతా ఫస్ట్‌క్లాస్ ఎక్కే యోగానికి నోచుకున్నవారు కాదు. అప్పుడు నాకు క్యాపిటలిస్టిక్ వ్యవస్థపైన ఏవగింపు కలిగింది.

కలిమి లేములే కదా! ఈ తారతమ్యాలకు కారణం. మనిషిని మనిషిని వేరుచేస్తూ సాంఘికంగా, సాంస్కృతికంగా అఘాతాన్ని సృష్టిస్తున్నది డబ్బే! అదే చెడ్డది. ఛ ఎంతమాట డబ్బులేంది నీవెక్కడ వుంటావు? డబ్బు అవసరమే అయినా దాని నియంత్రణలో పంపిణీలో, ఫలానుభవంలో వివేచనా, విచక్షణలు పాటించాలి. సరైన ప్రణాళికా స్వరూపం ఏర్పడాలి. అంటూ రూపొందించవలసిన మన ఆర్థిక వ్యవస్థనూ సోషలిస్టిక్ సిద్ధాంతాలను గూర్చి ఆలోచించడం మొదలుపెట్టింది మనసు.

ఇంతలోనే చిన్న పాటి మడత మంచమంత సైజులో వున్న వో పెట్టెను మోస్తూ కూలీవాడు ముందు నడుస్తూ వుంటే వో భార్యా భర్తల జంట కూతురితో కూడా వచ్చి ఎక్కి కూర్చున్నారు నా ముందు సీట్లో.

నాలో యింతవరకు విరాజమానమౌతూన్న తాత్వికుడూ అర్థశాస్త్రవేత్త నిష్క్రమించారు. మళ్లా నేను, నేనై మిగిలాను. ఆసక్తిగా చూస్తున్నాను. వచ్చిన జంట చిన్న సామాన్లన్ని సర్దుకున్నారు. తెచ్చిన పెట్టెను యిద్దరూ కలిసి కష్టంగా పైకి ఎక్కించి సర్దుకున్నారు. రాత్రి పూట కాబట్టి వాళ్లూ పక్కలు వేసుకున్నారు పడుకునేందుకు.

అమ్మో! మనుష్యులు, నేను ఎదురు చూచిన మా వాళ్లు. కడుపు నిండింది. ఇకేం పర్వాలేదు. తోడున్నారు. ఏ కలత లేకండా హాయిగా నిద్రపోతా ననుకున్నాను. కానీ అలా నిశ్చింతగా పడుకునే అవకాశాన్ని నాకు దూరం చేసింది, యిప్పుడిప్పుడే వచ్చి చేరిన నా బంధువర్గం, అదే నా ముందున్న జంట 'హంసఫర్' ఆదిలోనే హంసపాదం పడింది.

ఆ జంటలో కత్తి ధారలాంటి నోరున్న భార్యామణి భర్తను వుద్దేశిస్తూ.. 'డియర్ బి కేర్‌ఫుల్ విత్ ద లగేజ్, టు బి ఆన్ ద సేఫ్‌సైడ్. ప్లీజ్‌టేక్ ద చైన్ అండ్ టై అప్ ది ట్రంక్స్ టుగెదర్, అంటూ యింగ్లీషులో వుత్తర్వులు జారీ చేసింది.

భర్త వోపిగ్గా ''డోంట్ వర్రీ డార్లింగ్. నేను చూసుకుంటానుగా. నీవు పడుకో' అన్నాడు. అనునయంగా.

వెంటనే భర్త అనబడే భృత్యుడు క్యాబిన్ అంతా ఆక్రమించిన చిన్నా పెద్ద మాంచి లెదర్ బ్యాగులను ఓ పెద్ద గొలుసు తీసి ఇందాకటి దయ్యెప్పెట్టెతో కలిపి ఖైదీలను బేడిలు వేసి కలిసికట్టుగా లాక్కెళ్లుతున్నట్లు కట్టివేసాడు. మధ్యమధ్యలో భార్య విలాసంగా రిలాక్సౌతున్న పొజిషన్ నుండి కాస్త లేచి తలెత్తుతూ సవరణలు సూచిస్తూనే వుంది. ఆ సూచన వెంటనే కార్యరూపాన్ని ధరిస్తూవుంది. భర్త వస్తువులన్నీ జాగ్రత్తగా సర్దేశాడు. కూతురు ఏమీ మాట్లాడకుండా తల్లిని ఆనుకుని చూస్తూ కూర్చుంది.

నేనేదో పసిపాపలా యింతకింతకు ముడ్చుకు పోతూ పడుకున్నాను. సర్దుబాటైన తరువాత భర్తగారు చేతులు దులుపుకుంటూ 'ఎస్ డార్లింగ్, నౌ ఎవ్రి థింగ్ ఒ.కె. అంటూ కూతురికేసి చూస్తూ -

'నౌ కమాన్ స్వీటీ! యు గో అప్' అంటూ కూతుర్ని అటుకు ఎక్కిస్తున్న సామానులా పై బెర్తు ఎక్కించాడు.

ఈ జంట అమెరికాలో నివసిస్తున్న యన్.ఆర్.ఐ కి చెందిన తెలుగు కుటుంబంలా కన్పిస్తున్నారు. స్వదేశాభిమానంతో తమ వూరొచ్చి వెళ్లిపోతున్నట్లు కన్పించింది. భర్త బాగా చదువుకుని స్టేట్సులో పెద్ద వుద్యోగం చేస్తున్న వాడిలా వున్నాడు. భార్యకు అమెరికన్ పోకడలు

బాగా వొంటబట్టినట్లున్నాయి. ఆమె యింగ్లీషులో మాట్లాడ్తేనే గౌరవంగా భావిస్తూ, అది కాస్త అలవాటుగా చేసుకున్న బాబతులా వుంది.

వీళ్లిద్దరూ నైటీలు ధరించి బిడ్డకు గుడ్‌నైట్ కిస్‌లు యిచ్చే వరకే టైం పదకొండున్నర దాటింది.

దుప్పటి ముసుగు తన్ని శరీరం నిద్రను అభినయించినా, మేల్కొన్న మెదడు మాత్రం ఎదుటి వారి సంభాషణను చెవుల్లోకి పంపుతూ తిరిగి తాను స్వీకరిస్తూ యనలైజ్ చేస్తూనే వుంది.

తొలుదొల్త, ఎదుటవున్న నాకు తెలియకూడదనే ఐడియాతో కాబోలు యింగ్లీషులో ప్రారంభమైన సంభాషణ కాస్త రాను రాను తెలుగులోకి మారింది.

తరతరాలుగా ఇలా ప్రారంభమైన సంభాషణ వేడెక్కుతూ వచ్చింది. ఈ సందర్భంలో భార్య, భర్తపై వురుముతూ ' ఏంటీ? మీ వారికి పూర్తిగా కర్టిసీస్ కూడా తెలియవా? ప్రేమాభిమానాలు ఎలాగూ లేవు' అంటూ కట్టెవిరిచినట్లుగా భర్త వైపు వారిని గూర్చి నిందలు వేస్తూ మాట్లాడుతుంది.

అందుకు భర్త, అభిమానాన్ని చంపుకోలేక భార్యను నొప్పించలేక -

అయితే? జయా! వాళ్లు మనకు చేసిన లోటేమిటి? లోపం ఎక్కడ జరిగింది? అన్నాడు.

మీరెప్పుడూ ఇంతే, పెళ్లై పదిహేను సంవత్సరాల బట్టి చూస్తున్నానుగా? ఏనాడైనా మీవాళ్ల తప్పు వో చిన్న ఘప్పురవ్వంత కూడా కనిపించిందా? లేదు. ఇక్కడున్నన్నినాళ్లు సరే! ఇప్పుడు అయిదేళ్ల బట్టి అమెరికాలో వుంటూ, చుట్టాలున్నారనే మమకారం వల్లేగా యింత డబ్బు తగలేసుకుని వచ్చిందీ? మీ కుంటుంబం ఎప్పుడూ ఏదో భారతీయ సంస్కృతినంతా నెత్తినేసుకు మోస్తున్నట్లు ఆచారం, సంప్రదాయం, రీతి, రివాజులంటూ మా ఘనంగా మాట్లాడుతూ గొప్పలు పోతారు. మరి నా విషయంలో ఏమైంది' అంటూ సాధిస్తున్న భార్యకు అడ్డు తగులూ.

'పోనీ జయా! ఇప్పుడవన్నీ ఎందుకు? ఎవరి చాదస్తం వాళ్లది. దాంతో యిప్పుడు మనకేం పని. హాపీగా వెళ్లిపోదాం. తియ్యటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ, మళ్లా ఎప్పకి వస్తామో? మాతృభూమికి.'.

'వచ్చింది చాలు. అది కాదండీ! నాకు తెలియక అడుగుతాను. లేకలేక వచ్చాం కదా! వచ్చారన్న ఆదరం, ప్రేమలు ఎక్కడా కనిపించలేదు. పోనీ లాంఛనంగానైనా ఓ నూలు చీర వో రెండు రవికెలు, పోనీ నా బిడ్డకు వో పట్టుపరికిణీ ముక్కైనా కొనిపెట్టారా? పైగా మనమే వాళ్లకీ, వీళ్లకీ అంటూ బోలెడు డాలర్లు పోసి గిఫ్టులనీ సింగినాదం అనీ పట్టుకొచ్చాం. ఆ

మాత్రం రిటర్న్ గిఫ్ట్‌గా ఏదైనా వో మంచి క్రాఫ్ట్ కొని యివ్వొచ్చుగా? ఆ మాత్రం యింగితజ్ఞానం మీవాళ్లకు వుంటేగా? అంటూ పొడిచింది.

'ప్లీజ్! ఫర్ హెవెన్స్ సేక్ స్టాప్' అంటూ అసహనాన్ని ప్రకటిస్తూ. 'జయా! ఏంటి? నీ పిచ్చి? మనం ఇక్కడికి వచ్చింది నాలుగు రోజుల పాటు అందరితో కలిసి సుఖంగా గడపడానికి గాని, వాళ్లిస్తే గాని గడవక కాదు. చూడూ! నీకు చీరలకేం తక్కువ? కావాలీ అంటే ఎంతైనా సరే నీకు నచ్చిన పట్టు చీర కొనుక్కో' అన్నాడు. ఆ మాట విన్న వెంటనే-

'అబ్బబ్బో! ఎంత ప్రేమ? కొనిస్తాడట, కొనిస్తాడు. ఈ డబ్బు మాత్రం ఎవరిదని? వీళ్లకోసం ఈ ప్రాంతాలకు వచ్చి రోడ్లు సరిగ్గాలేక మంచినీళ్ల సౌకర్యం లేక దుమ్ము, ధూళి కొట్లాడుతున్న వూళ్లెంటపడి చుట్టపు చూపులకంటూ వెళితే అలవాటు తప్పిన ప్రకృతులు ఈ కలుషిత వాతావరణంలో యిముడలేక ఇన్‌ఫెక్షన్ సోకి బాధపడ్తూ నానా మందులు మింగి వెళ్లాలి. మీరేమైనా అనండి, నాకు మీ చెల్లెలు అంటేనే అసహ్యం' అంటూ కటువుగా మాట్లాడింది.

దీంతో బాగా కోపం వచ్చింది ప్రభాకరానికి. (మాటల సందర్భంలో తెలిసింది. భర్త పేరు ప్రభాకర్. వుద్యోగం ఇంజనీయరింగ్ కంపెనీలో. భార్య జయ అంటూ) ఈమారు ప్రభాకర్ కంఠాన్ని బాగా పెద్దదిగా చేస్తూ -

Please tell me frankly. what is your idea? do you want me to cut all my connections with my family? that is impossible. take care" అంటూ వో వార్నింగ్ లాంటిది యిస్తూ చీదరించుకున్నాడు.

అప్పుడు జయగారు, ఎప్పుడూ సమయానికి ఆదుకునే ఆత్మబంధువుల్లా పిలిస్తే పలికే చెలికత్తెల్లా వుండే కన్నీళ్లను ఆసరాగా తీసుకుని డగ్గుత్తికతో -

' ఇలా మీరు అర్ధరాత్రీ, అపరరాత్రీ నాతో మీ బంధువులను వెనకేసుకొచ్చి గొడవపడడం నాకిష్టంలేదు.' అంటూ లైటు ఆర్పే ప్రయత్నంలో విసురుగా లేచింది. అలా లేచి లైటు స్విచ్ నొక్కుతూ వున్న భార్యను ప్రియురాలిని లాలిస్తున్న ప్రియుడిలా ఇంజనీయరుగారు అమాంతం రెండుచేతులా అందుకుని పసిపిల్లలా వళ్లో పడుకోబెట్టుకుని ఎంతో అనురాగంతో 'ప్లీజ్! జయా! మై డార్లింగ్!' అంటూ తల నిమురుతూ చెంపలు ముంబించాడు.

అటు వైపు తిరిగిన నేను ఎక్కడ కదుల్తానో? రసభంగం చేస్తానో? అంటూ వూపిరి బిగబట్టుకున్నాను. శ్రీగా నా ఎదలో దాగిన తియ్యటి కోరికలు చిగిరించగా, మాదే విజయం అంటూ వో గర్వరేఖ ధాటిగా విజయపతాక ఎగురవేసింది.

భర్త బుజ్జగింపులతో కోపం చల్లారిన జయకు కూతురికి మందు యిచ్చే విషయం జ్ఞాపకం వచ్చింది. 'ప్లీజ్ పాపను లేపుతాను మందు యివ్వండి' అంటూ భర్తను స్వీట్‌గా రిక్వెస్ట్ చేసింది.

'అయ్యో!' మర్చిపోయానంటూ కంగారుగా లేచి ఎన్నో బుజ్జగింపులతో మందు తాగించే ప్రయత్నం చేస్తున్నాడు. అయినా ఆ పిల్ల ఆయన మాటలేవీ పట్టించుకున్నట్లు లేదు. తల్లి లేచి బలవంతంగా వో పొట్లం విప్పి నోట్లో వేసి 'అది చప్పరించి నీళ్లు తాగు' అంది. ఇంత అన్నా ఆ పాపగారి చూపుల్లో ఏ అర్థమూ స్ఫురించలేదు. ఏదో నిర్లక్ష్యంగా నవ్వుతున్నట్లు కనిపించింది.

పిల్ల ప్రసక్తి రాగానే నాకు అప్పుడే మెలకువ వచ్చినట్లు నేను పక్కమార్చి ఇటు తిరిగాను. ఆ పిల్లవైనం చూచి -

'ఓహో! అమెరికా పిల్లల ట్రేనింగ్ చాలా బాగా బుద్ధులు నేర్పుతున్నట్లుంది. ఎంతో బాగుంది. తలిదండ్రులూ సహిస్తూ చూస్తున్నారు. కన్నవారి మాటకు విలువ చిన్న మెత్తులేకపోయినా కనీసం వెటకారం లేకున్నా బాగుండేది. పైగా ఆడపిల్ల. అయ్యో ! జాతి భవిష్యత్తు ఏం కాను! అంటూ అక్కడుంటున్న తన వారిని గూర్చి నా మనస్సు ఆందోళన పడింది.

పాపం! గిరీశం తర్ఫీదు పొందుతున్న వెంకటేశాన్ని చూచి కరటకశాస్త్రి యిందుకేనేమో బాధపడివుంటాడు. జన్మతః వచ్చిన బుద్ధులకు తోడు పరిసర ప్రభావం, శిక్షణా విధానం, సాహచర్యం ఎంతో ప్రభావాన్ని లేత మనస్సులపై చూపుతాయి. అందుకే 'కొమ్మై వంగంది మానై వంగుతుందా' అనే సామెత పుట్టి వుంటుంది. వో పర్సనాలిటీ అంటూ ఫార్మ్ కాకముందే తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది అంటూ నిర్ణయించింది నా మనస్సు. ఆలోచనలతో అలసిపోయిన నా మనస్సుకు యింకా ఆలోచించేందుకు వోపిక లేనట్టయింది. ఏమైతేనేం, నేను చేసేదేముంది? అంటూ ఆ వైపు చూడకండా నిద్రలోకి వెళ్లిపోయాను.

ఏదో స్టేషన్‌లో రైలు ఆగినట్లుంది. తెల్లవారిందేమో? చాయ్, కాఫీలంటూ అమ్ముతున్నారు. అయినా చలికి ముసుగు తన్ని పడుకున్న వాళ్లెవ్వరూ లేవలేదు. మెలకువ వచ్చిన నేను, అటూ యిటూ కదిలి లేవబోయాను.

ఇంతలో నా తలపై ఏదో బరువైన మూటలాంటి వస్తువు ఠపీమని పడింది. ఏదైనా ఘోరప్రమాదం జరగబోతుందా? ఆ కుదుపుకు అతలాకుతలమై వస్తువులన్నీ దొర్లి పడబోతున్నాయా? అంటూ కలియజూచాను. పడ్డ వస్తువును లేచి కూర్చుని చేత్తో తాకి చూచాను. అది ఓ పర్సులా వుంది. అందులో పెట్టిన సౌందర్య ప్రసాధనాలతో బరువుగా వుంది.

వారి ప్రమేయంలేకుండానే వాళ్ల వస్తువు నాపై పడి బాధ కలిగించినందుకు ఆ పిల్లనో, కాక వాళ్ల తల్లిదండ్రో! సారీ చెబుతారనుకున్నాను. ఎవ్వరూ నోరు కదపలేదు. పడిన ఆ వస్తువు కనీసం తమదంటూ కూడ తీసుకోలేదు. చేసేది లేక నేనే ఆ పిల్లతల్లిని లేపి ఆ

పర్సు చేతికందించాను. 'పై నుండి మీ అమ్మాయి పర్సు పారవేసుకున్నట్లుంది' అని అంటూ. ఆపిల్ల మెల్లకువగానే వుంది. మళ్లా గుడ్లప్పగించి చూస్తూ నవ్వుతుంది.

'ఛీ! ఛీ! ఎంత అహంకారం. ఎంత డబ్బున్నా యింత కాఠిన్యమా? ఏ కోశానా సంస్కారం, సభ్యతలు అంటూ లేకుండా పశువుల్లా ప్రవర్తిస్తున్నారంటూ ఏవగింపు పుట్టుకొచ్చింది.

తల్లి ఆ పర్సు తమదేనన్నట్లు తలూపి దాన్ని చేతిలోకి తీసుకుని 'అమ్మా! స్వీటి బేబి! యిలా చూడు! నీ పర్సు పారేసుకున్నావ్, తీసుకో తల్లి' అంటూ అందివ్వబోయింది. అయినా ఆ స్వీటిలో ఏ సంచలనమూ లేదు. అందమైన కళ్లతో ఎక్కడో చూస్తుంది. తనలో తానే నవ్వుకుంటుంది. ఆ చూపులు కళావిహీనమై గాజువారిన చూపుల్లా వెర్రిగా వున్నాయి. అప్పుడు గాని నాకు అర్థం కాలేదు. ఆ అమ్మాయి మానసిక రోగి అన్న విషయం. ఆ క్షణంలో అంత ఎత్తున బిరుసుగా కనిపించే ఆ కుటుంబం వారు కుదింపబడి, కుప్పగూలి దైన్యపు ముద్దల్లా కనిపించసాగారు. సొగసుతో ఐశ్వర్యంతో భర్త ఆదరంతో తనకెవ్వరూ సాటిలేని సత్యభామలా వున్న జయగారి గర్వమంతా నేల పాలు కాగా ఆమె తాను చెయ్యని తప్పుకు అవమాన భారంతో కృంగి పోతున్నట్లు, అపరిచితనైన నాముందు భంగపడినట్లు ఆమె కళ్ల నీళ్లొత్తుకుంది.

అప్పుడు నాకు తెలిసొచ్చింది. ఆరోగ్యాన్ని మించిన భాగ్యం మరొకటిలేదని. శారీరక రోగం కన్నా యీ 'మెంటల్ యిల్‌నెస్' తీవ్రతరమైన పీడ. ఇది వ్యక్తిని అన్నివిధాల కొరగాని స్థితికి దిగజారుస్తుంది. యిది శాపగ్రస్తులు అనుభవించే పాపఫలం లాంటిది. యిది సోకిన వారినే కాదు భరించే వారినీ చూచేవారినీ సుఖంగా ఉండనివ్వదు. మరీ చిన్న పిల్లలైతే తల్లిదండ్రి అనుభవించే నరకం అంతా యింతా అంటూ అంచనా వేయలేం. అందుకే, కన్నవారు యిదేదో నలుగురికి తెలియకూడని అపవాదుగా భావిస్తూ, రోగాన్ని చాలాకాలం వరకు దాచిపెడ్తూ వుంటారు. అది కాస్త ఏకు మేకై చేయిదాటుతుంది. యీ దంపతులు అన్నీ తెలిసిన వారు కాబట్టి వోపిగ్గా చికిత్స చేయిస్తున్నారు. పిల్ల బొమ్మలా వుంది అని ఆలోచిస్తున్న నా మనసు ఆ పిల్ల తల్లి జయవైపు మళ్లింది.

పాపం! జయ యింతటి చిచ్చును గుండెల్లో దాచుకుని పైకి ఎంతో కేర్‌ఫ్రీగా అహంకారిగా, గయ్యాళిగా కన్పిస్తోంది. తన బాధను కప్పుకునేందుకు తొడిగిన బురఖా ఈ ప్రవర్తన అంటూ నేను గ్రహించగానే ఎక్కడలేని సానుభూతిని జయపై వొలికించింది నా మనసు.

నిజమే! ప్రపంచంలో ఏ జీవి పరిపూర్ణమైన సుఖసంతోషాలను అనుభవించడం లేదు. ధనం, హోదా చక్కదనం చదువు తెలివీ అన్నీ వున్నా ఏదో వెలితి, ఏదో బాధ, ఏదో లోపం ఆ మెరుపుల్లో దాగి కుమ్మరి పురుగులా తొలుస్తూనే వుంటుంది. అందుకేనేమో బుద్ధ భగవానుడు సకల సుఖవాసమైన సంసారిక జీవితాన్ని త్యజించి పరమసుఖ సంపాదన

కోసం పడరాని పాట్లు పడ్డాడు. కాకపోతే అమృతకుల్య వంటి భార్యను, రసగుళికవంటి నవజాత శిశువునూ వదిలి వెళ్లుతాడా?

ఇదేం వెర్రి నాకు. వేదాంతం ముదిరినట్టుంది. తాత్త్విక చింతనం వైపు గమిస్తున్నాను. ఇంకా చేయవలసింది ఎంతో వుంది. ఇప్పుడే వైరాగ్యం వద్దు అంటూ అటు వైపు తిరిగి నేనే ఏదో సందర్భాన్ని కలిగించుకుని ఆ దంపతులను సంభాషణలోకి దించాను. అప్పుడు నాకు తెలిసొచ్చింది జయ మనస్సు అద్దం లాంటిదని. ఇంతవరకు ఆమె భర్తతో వ్యవహరించిన విధానానికీ ఇప్పటికి ఎంతో తేడా కన్పించింది.

తన కూతురిని ఆప్యాయంగా పలుకరిస్తూ దగ్గరికి తీసుకోగానే ఆమెలో వున్న ఇందాకటి అహంకారం, దురుసుతనం అన్నీ మాయమయ్యాయి. అత్తవారింట్లో తెలిసీ తెలియని బంధువర్గం తనకు ప్రాణప్రదమైన కూతుర్ని చులకనగా చూశారన్న బాధతో దెబ్బతిన్న తన అహాన్ని తృప్తి పరచేందుకు మరో ప్రతీకార మార్గం లేక భర్తవైపు చుట్టాలను చులకన చేస్తూ కఠినంగా మాట్లాడిందే తప్ప నిజానికి జయ అలాంటిది కాదు. సంస్కారం, సభ్యతలున్న వ్యక్తే అంటూ వాదించింది నా మనస్సు.

ఇలా నా ప్రయాణం చివరి నిమిషం దాకా పిచ్చాపాటి మాట్లాడుకుంటూనే వున్నాం. మా యిద్దరి మధ్య స్నేహవాత్సల్యాలు దట్టంగా చిగురించాయి. స్టేషను వచ్చిందేమో రైలు ఆగింది. అమ్మా ! విజయవాడ వచ్చింది. సిద్ధంగా వుండండి అంటూ మా పి. ఎ. గారు ప్రవేశించారు.

వెళ్లడానికి సిద్ధపడుతున్న నాకు ఆ జంట నమస్కరించడమే కాకండా 'స్వీటీ! అమ్మమ్మగారికి నమస్కారం చెయ్యి' అంటూ ఆ పిల్లచేత నా కాళ్లు ముట్టించారు. నా కళ్లు చెమర్చాయి. ఎంతైనా మన జాతి నరనరాల్లో జీర్ణించుకున్న సంస్కారం ఎక్కడికి పోతుంది? అంటూ నా మనస్సు ప్రసన్నంగా నవ్వింది. ఆ అమ్మాయికి దీవెనలు వర్షిస్తూ.